

# "మ లు పు"

రచన : శ్రీ తాళ్ళూరి కామేశ్వరరావు

"రాధా...రాధా డియర్! వంట అయిపోయిందా?

ఏమిటి రాధా, అలా వున్నావేమిటి? ఏమైంది? అరగంట క్రితమే కదా నేను బజారు కెళ్ళాను. ఇంతలో ఏం జరిగింది? ఏం జరిగింది రాధా?" అంటూ కంగారు పడుతూ అడిగాడు మురళి.

"మరే...మరే...నేను చెప్పలేనండీ!" అంటూ ముఖం చాటేసింది రాధ.

"ఏమిటి, ఏదో మాడువాసన వస్తున్నట్టుంది!" వంటింట్లోని స్టవ్ వైపు చూసి అడిగాడు మురళి.

"అవునండీ! గుత్తి వంకాయకూర మాడిపోయిందండీ...మీరు ఎంతో ఇష్టపడి చెయ్యమన్న కూర, ఇలా మూకిడిపాలైపోయిందండీ! ఛ-పాపిష్టి దాన్ని. మొగుడికి ఇష్టమైన కూర చక్కగా వండి పెట్టలేని దురదృష్టవంతురాల్ని. ఆ దేవుడు నన్ను క్షమించడండీ!" అంటూ భోరుమంది రాధ.

"అంతే కదా! ఈ రోజు కాకపోతే, మరో రోజు చేసుకుందాం. ఈ మాత్రం దానికి ఇంత దిగులు పడిపోవడం ఏం బాగోలేదు రాధా! మనది కొత్త కాపురం కదా!" అంటూ భార్యను ఓదార్చాడు మురళి.

"అది కాదండీ! మీరు ఎంతో ఆశపడి అడిగారా? తీరా, కూర స్టవ్‌మీద పడేసి కలుపుతున్నా. ఇంతలో పక్కింటి పిన్నిగారొచ్చారండి. ఆవిడతో మాట్లాడుతూ మర్చిపోయానండీ!" అంటూ తన తప్పు లేదని మరోసారి చెప్పబోయింది రాధ.

"Dont Worry డియర్, మరపు మానవ సహజం!" అన్నాడు మురళి చాలా సింపుల్‌గా.

"మీరెంత మంచివారండీ!" అంది రాధ.

"అవునూ, రాత్రి యిక్కడ నేను విడిచిన ప్యాంటు, షర్టు వుండాలి. ఎక్కడ పెట్టావు?"

"ఆవా, రాత్రి సర్ఫ్‌లో నానబెట్టి, ఉదయాన్నే ఉతికి, మేడ మీద ఆరేశా" అంది రాధ.

"నీ ప్యాంటుజేబులో రెండు వందలు వుండాలి. తీశావు కదా?"

"ఆఁ...లేదండీ!" అంది రాధ మామూలుగా.

"లేదా...బట్టలు ఉతికే ముందు జేబుల్లో చూసి ఉతకమని నీకు ఎన్ని సార్లు చెప్పాను?" అంటూ చిన్నగా ఉరిమాడు మురళి.

"మరచిపోయానండీ...దానికి ఇంతగా అరవాలా! నా కేమన్నా సరదా అటండీ, డబ్బులు జేబులో వుంచి ఉతకడానికి!" అంది రాధ.

"అవునూ, ఇందాక మాడిన వాసన వచ్చింది.

"ఇప్పుడు ఏదో కాలుతున్న వాసన వస్తుందేమిటి"? మళ్ళీ ఏదో అనుమానంగా అడిగాడు మురళి.

"ఆ—మీ షర్టు అనుకుంటానండీ! ఇస్త్రీ చేస్తుంటే మీరు పిలిచారు. ఇస్త్రీపెట్టె షర్టుమీద వుంచి మరచి పోయి వచ్చేశానండీ!" మళ్ళీ తన తప్పు లేనట్టు చెప్పింది రాధ.

"మరచిపోయాను—మరచిపోయాను. ఈ మాట మన పెళ్ళయిన ఈ ఆరు నెలల్లో ఆరు లక్షల సార్లు అనివుంటావు. ఈ ఒక్క రోజులో మరచిపోయానన్న మాటతో ఎన్ని నాశనం అయ్యాయో చూశావా?" కాస్త చేరాగ్గా అన్నాడు మురళి.

"అందుకే చెబుతాను. నేను ఒక పని చేస్తుంటగా పిలవకండీ! ఆ పని మరచిపోతాను" అని జవాబిచ్చింది రాధ.

"నిన్నసలు గిన్నీస్ బుక్కులోకి ఎక్కించాలి. 'మరచిపోయాను' అన్న పదాన్ని ప్రపంచంలో ఏ ఒక్కడూ ఇన్ని సార్లు ఉపయోగించి వుండడు. సర్లే, కొత్తకాపురం కదా! ముందు-ముందు నీకే తెలుస్తుంది. అన్నం వడ్డించు, ఆఫీసుకు టైమ్ అవుతుంది" అన్నాడు మురళి.

"వడ్డించాను రండి."

మురళి పప్పు అన్నం కలుపుకుని ఒక ముద్ద నోట్లో పెట్టుకుని "రాధా!..." అంటూ గట్టిగా అరిచాడు.

"మళ్ళీ ఏమయ్యిందండీ?"

"పప్పులో ఉప్పు" సింపుల్‌గా చెప్పాడు మురళి.

"అయ్యో, మరచిపోయానాండీ?" అనుమానంగా అడిగింది రాధ.

"వేరే చెప్పాలా? అది నీ జన్మ హక్కు. ఆ మాటతో నా ప్రాణాలు తోడేస్తున్నావు కదా!" అన్నాడు మురళి.

"ఏమండీ! మరచిపోకుండా వుండడానికి ఏదైనా మందు వుందేమో డాక్టర్ను కనుక్కోండి!" అంది బ్రతిమాలుతూ రాధ.

"ఊ...అదొక్కటే తక్కువ ఆ మందైనా మరచి పోకుండా వేసుకోవాలి కదా!" అన్నాడు మురళి విచారంగా.

"ఏమిటోనండీ – మరచిపోయా నన్న మాటతో మిమ్మల్ని చాలా ఇబ్బంది పెడుతున్నానేమో అనిపిస్తుందండి" అంది రాధ బాధగా.

With best compliments from :

R.K.S. KNITTINGS TIRUPUR

Trade Mark
Regd No. 342215

మా ప్రత్యేక తయారింపులు :

ISI 4964-80

* కూల్‌టెక్స్ ISI
* పాయల్ ISI
* జన్‌టా
* ఫ్రాంక్ జెట్టి
* పాయల్ బ్రీఫ్
* రన్నర్ బ్రీఫ్
* డ్యూరబుల్ జెట్టి

Phone : 22016 Resi : 27169

R. K. S. KNITTINGS

43, Cauvery St., Odakkadu, TIRUPUR-638 602.

"రాధా! ముందుగా మన్వొక పని చెయ్యి ప్రతి విషయం మరిచిపోకుండా జాగ్రత్తగా గుర్తుంచుకో! ఒకవేళ నిజంగా మరిచిపోయావనుకో - వెంటనే 'మర్చిపోయాను' అన్న మాట అనకుండా కాసేపు ఆలోచించుకో! వేరే విధంగా జవాబు చెప్పు" అంటూ మురళి రాధకి 'మరచిపోయా' నన్న పదాన్ని 'ఎలా మరచిపోవాలా' అనే సలహా యిచ్చాడు.

"సరేనండీ! ఇకపై మీరే చూస్తారు కదా?" అంది రాధ.

"అయితే ఈ రోజు సాయంకాలం మనం సినిమాకి వెళ్దాం. సరిగ్గా 5 గంటలకి రెడీగా వుండు. సరేనా?" అన్నాడు మురళి.

"సరే" అంది రాధ.

సాయంకాలం 5 అయ్యేసరికి మురళి ఇంటి ముందు వాలాడు. అందంగా ముస్తాబయ్యి గుమ్మంలో నిలబడ్డ భార్యను చూసి అదిరిపడ్డాడు. "వెరీ గుడ్ రాధా... వెరీ గుడ్! ఎంత బాగా గుర్తుంచుకున్నావు" అంటూ ఆనంద పడిపోయాడు మురళి.

"ఇప్పటినుండి మీరు చెప్పినట్టు చాలా జాగ్రత్తగా గుర్తు వుంచుకుంటామనుకుంటున్నానండీ!" అంది గొప్పగా రాధ.

"సరేగానీ, బీరువాలోది నాకో డ్రస్ తీసి వుంచు. ఈ ఫ్యాంట్‌లోని పర్స్, అవీ ఆ ఫ్యాంటులోనికి మార్చు. నేను రెండు నిముషాల్లో ముఖం తోముకొని వచ్చేస్తా" అంటూ బాత్‌రూమ్‌లోనికి పరుగెట్టాడు మురళి

"ఓ. కే." అంది రాధ.

క్షణాల్లో మురళి తయారయ్యాడు. ఇద్దరూ బయటికి వచ్చారు. "రాధా! నువ్వు ఇంటికి తాళం వేసి బయట నిలబడు, షెడ్లోంచి స్కూటర్ తెస్తా!" అంటూ వెళ్ళాడు మురళి.

తను చెప్పిన మాట వెంటనే ఆచరణలో పెట్టిందన్న ఆనందంతో పొంగి పోతున్నాడు మురళి. స్కూటరు గాలిలో తేలిపోతున్నట్టు అనిపించింది. పది నిముషాల్లో సినిమా హాలు ముందు ఆగింది స్కూటర్. స్కూటర్ పార్క్ చేసి టిక్కెట్ల కోసం జేబులో చెయ్యి పెట్టి చూశాడు. పర్సు చేతికి తగల్లేదు.

"రాధా! నా పర్సు ఈ ఫ్యాంటులోనే మార్చావా?"

"రాధా! ఒక్కసారి ఉలిక్కి పడింది. ఒక్క నిముషం ఆలోచించింది. మరచి పోయానని చెప్ప కూడదు కదా - అనుకొని – "మార్చానండీ! లేదా ఒక వేళ దారిలో పడిపోయిందంటారా?..." అంది రాధ.

"ఇప్పుడెలా...ఇంటికి వెళ్దాం పదు!" అన్నాడు మురళి.

స్కూటర్ ఇంటివైపు పరుగులు తీసింది చిరాగ్గా. క్షణాల్లో ఇంటి ముందు ఆగింది. ఒక ప్రక్క మురళికి అనుమానంగానే వుంది. పర్సు మార్చి వుండక పోవచ్చని. విడిచిన ఫ్యాంటులో పర్సు వుండిపోయింది. ఇప్పుడు ఎలా అనుకుంటుంది రాధ మనసులో కంగారు పడుతూ.

తాళం తీసుకుని గుమ్మం దగ్గరకి వెళ్ళారు యిద్దరూ మౌనంగా. తెరచివున్న గుమ్మం తలుపులు చూసి తెల్లబోయారు. వేసిన తాళం వేసినట్టే వుంది కానీ గొళ్ళెం మాత్రం పెట్టలేదు. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు. కంగారుగా లోపలికెళ్ళారు. ఇంకే వుందీ...అప్పటికే యిల్లంతా చక్కబెట్టేశారు. రాధ కళ్ళల్లో నిజంగానే నీళ్ళు తిరిగాయి, మురళిని పట్టుకుని బావురుమంది.

"Dont Worry, రాధా! జరిగి పోయిందానికి విచారించకు. ఇన్నాళ్ళు అకతాయిగా గడిపేశావు. ఇప్పుడు నువ్వు బాధ్యతగల స్త్రీవి. అవునా...ఇక మీదట మనం ఈ సంసార సాగరంలో జాగ్రత్తగా ఈ దారి తెలిసిందా?" అన్నాడు మురళి.

"నన్ను క్షమించండి!..." అంది రాధ ఎంతో వినయంగా.

ఒక్కసారిగా రాధలో వచ్చిన 'మలుపు'కి మనసులో ఆమెను అభినందించాడు మురళి. *